# బలిదానం

(నాటిక)

శ్రీమతి ఘండికోట సావిత్రిగారు.

## పాత్రలు

రాణా:- మేవాడ రాజు, వీరుడు, అందగాడు.
చందావత్ - మేవాడ సర్వసైన్యాధిపతి.
పురోహితుడు, కొందరు సర్దారులు.
హాడారాణి:- చందావత్ భార్య, వీరనారి అందకత్తె.

౧

[మేవాడరాజ సౌధమునందలిగది. గదిలో రెండు సోఫాలు. కిటికీదగ్గరగా హంసతూలికా తల్పము. హాడారాణి ప్రకృతిని తిలకిస్తూంటుంది. చందావత్ మెల్లగావచ్చిహాడా రెండుకన్నులు మూస్తాడు].

హాడా:-(ఉలుక్కుపడి) అబ్బా! ఎందులకీ మోటు పరిహాసము.

చందావత్:-(నవ్వుతూ) ఎందుకంత తత్తర. (హాడాను దగ్గరగా తీసుకొని) దానికేమిగాని, నీతోనొకవిషయము చెప్పదలచితిని.

హాడా:-ఏమది, నాథా! చెప్పుడు.

చందావత్:-హా! చెప్పుటకేమున్నది. ఎట్టి తండ్రియైన కన్నకూతురు పట్ల ఇంతకాఠిన్యము వహించునా యని.

హాడా:-ఏమది! మీరుచెప్పునది నాకర్థమగుటలేదు.

చందావత్:-రూపనగర రాజకుమారిత, తన్ను ఔరంగజీబునకిచ్చి పెండ్లిజేయు నుద్దేశముతోనున్న తండ్రి వారినుండిరక్షించమని రాణావారిపేరిట జాబువ్రాసినది.

హాడా:-ఇంతకీ, రాణావారు ఆమెకు సహాయమొనర్తురా?

చందావత్:-విచారమెందులకు, శరణన్నవారిని రాణావారు విడుచువారుకారు. కాని, మనకు ఔరంగజేబుతో యుద్ధముతప్పదు.

హాడా:-ఏమైననేమి! తప్పక ఆమెను రక్షించవలయును. (పైనుండి పిలుపువిని) నేడు సర్వసైన్యాధిపతుల నిర్ణయము జరుగునట, మిమ్ములను సభకు రమ్మనిఆజ్ఞ.

చందావత్:-ఔను! వెళ్లకతప్పదు.

౨

[మేవాడ రాజసభ నిండుగా అలంకరింపబడి యున్నది. రాజావారు సింహాసనముపై అధిష్టించి యుండిరి]

రాణా:-సర్దారులారా! రూపనగరరాజు తురుష్కులతో సఖ్యము చేయుచుండెనట. యిపుడు మన కర్తవ్యమేమి?

ఒకసర్దారు:-ప్రభూ! మనము ఇప్పుడు తొందరపడుట మంచిదికాదు.

రాణా:-నేడో! రేపో! మనపై దండెత్తిన............

చందావత్:-(మధ్యనుండిలేచి) ప్రభూ మనము రూపనగరముపై ముందుగా దండెత్తిన, మనకు తురుష్కుల భయముండదు.

రాణా:-సెబాష్! చందావత్! నీవే స్వయముగాపోయి రూపనగరముపై యుద్ధము ప్రకటింపుము.

చందావత్:-చిత్తము! ప్రభూ. (అని నిష్క్రమించును.)

(చందావత్ అంతిపురిలో ప్రవేశము. హాడా పూమాలతో స్వాగతము.)

చందావత్:-ఏమి యీ సంతోషము.

హాడా:-(చిరునవ్వుతో) తమకు, సర్వసైన్యాధిపత్యము లభించినందులకు. (చందావత్ కళ్లలోనికి చూస్తూ) దానికేమిగాని, మీ ప్రయాణమెప్పుడు?

చందావత్:-ఎప్పుడననేల, నేడే పోవలయును. (లేచి దుస్తులను మార్చుకొనుచుండును, హాడాలోనికి పోయి హారతి పళ్లెముతో ప్రవేశము.)

చందావత్:-(హాడాను దగ్గరగా తీసుకొని) హాడా; నేడేలకో; యుద్ధమునకుపోవ మనసొప్పకున్నది. నీతో ఆనందముగా కాలము గడపవలెనని యున్నది.

హాడా:-(నడుమునకు ఖడ్గము కడుతూ) నాథా! సర్వము తెలిసి అటుల అనుచున్నారేల? వీరులకు యశస్సు ముఖ్యముగాని తుచ్ఛప్రేమగాదు. స్వగృహమునుకాదు.

చందావత్:-హాడా! సరే! పోవుచున్నాను. శత్రువులు మహాబలవంతులు, ఎట్టికష్టములోనైనా, మన వంశగౌరవము కాపాడుదువని తలచెదను.

(చందావత్ నిష్క్రమణ)

(హాడా గదిలో విచారంగా ఆలోచిస్తూ ఉంటుంది. చెలికత్తెలు మాలనుగుచ్చుతూ ఉంటారు.)

హాడా:-ఆహా! ప్రేమ ఎంతగ్రుడ్డిది. నానాథునికే నాపై ఎంత అనుమానము జనించినది. వారికి దేశరక్షణ, ఎటువంటిదో నాకువంశమర్యాద కాపాడుట అటువంటిదని ఎరుగరు కాబోలును. (ఎదురుగా చూస్తూ) గురువర్యా; నమస్కారము.

గురువు:-(రెండుచేతులు పైకెత్తి) దీర్ఘసుమంగళీభవ.

హాడా:-గురువర్యా! మీరాకకు కతనము.

గురువు:-పర్వదినముకదా, పతివ్రతాధర్మము చెప్పుటకు. ఇది సర్వసైన్యాధిపతి ఆజ్ఞ.

హాడా! (కోపంతో) చాలు! గురువర్యా! మీరేమియు చెప్పనవసరములేదు. (పట్టరాని దుఃఖముతో ఎదురుగా ఉన్న కాళీవిగ్రహము దగ్గరకుపోయి) తల్లీ! కాత్యాయినీ! ఏల, నన్నంత కళంకినిగాజేతువు. నాభర్తనాపై వ్యామోహముచే, తన కార్యము మరచునేమో, ఇప్పుడేదిగతి, హుం! మరచితిని. (గురువువైపు

చూచి) గురువర్యా క్షమింపుడు. (గబగబా ఉత్తరము వ్రాసి) తల్లీ! రాజపుత్రవంశమును, భర్తను రక్షింపుము. (అంటూ మొలనున్న కత్తినితీసుకొని ఒక్కమారుగా నరుకుకొనును. శిరము దేవిపాదములపైబడును. రుధిరము ఎత్తుగా స్రవించి, కాళీవిగ్రహమును అభిషేకించును.)

3

(రూపనగరమైదానమందలి గుడారములలో, చందావత్, కొందరు సర్దారులు, మంతనము చేయుచుందురు.)

సర్దారు:-ప్రభూ! యీదినము విచారముగా నుంటిరేల?

చందావత్:-నేడేలకో! మేవాడ వోవ నిచ్ఛ జనించుచున్నది.

సర్దారు:-రూపనగరముసంగతి తెలియకుండగనే?

చందావత్:-ఏమైననేమి, పోకతీరదు. (పైనుండి పురోహితుడు రక్తసిక్తపు మరకలతో ఉత్తరము పట్టుకొని ప్రవేశము) (చందావత్ ఉత్తరము అందుకొని వడకుచున్న చేతులతో జాబుచూచి) హా! హాడా! ఎంత ఘోరము చేసితివి. నీపైగల ప్రేమవలన అటులచేసితినిగాని, వేరుకాదు. (పండ్లుకొరుకుతూ) అనుమానపిశాచము ఎంత దారుణనాటక మాడించినది. (ఉద్రేకంతో) సైనికులారా! హాడా ఉపదేశమే మనకు రక్ష, రెండు! మనకర్తవ్యము పాలన సేయుదము.

(అందరూ ఆయుధములు దూసికొని రూపనగరముపైకి పోవుదురు, మేవాడపతాకము గాలిలో వినురున ఎగురుతూ ఉంటుంది.) (సరి)

